'రాగిడికి' 2లక్షల మెజార్టీ పక్కా

కీసర, మే 15: మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మా రెడ్డి 2లక్షల మెజార్టీతో గెలుపొందడం ఖాయమని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. మండల ఎన్నికల ఇన్‌చార్జి సునీతవేంకటేశ్వర్‌రావు, మండల బీఆర్ఎస్ నాయలు శ్రీధర్‌రెడ్డితో కలిసి బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థికి ఫోల్ అయిన ఓట్ల శాతం గురించి ఎమ్మెల్యే మల్లారెడ్డికి వివరించారు. ఎమ్మెల్యే వారితో కలిసి ఓటింగ్ సరళి గురించి ఆరా తీసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మేడ్చల్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ స్థానాల నుంచి భారీ ఎత్తున ఓట్లు బీఆర్ఎస్‌కు పోలు అయ్యాయని, కాంగ్రెస్, బీజేపీల కంటే భారీ మెజార్టీ సాధించడం ఖాయమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నగర ప్రాంతాల్లో మాజీ మంత్రి కేటీఆర్ చేపట్టిన అభివృద్ధే ఈ ఎన్నికల్లో తమ అభ్యర్థి గెలుపునకు విజయ సోపనాలు అవుతాయన్నారు. ఎన్నికల ప్రచారంలో కూడా ఓటర్ల నుంచి కూడా తమ పార్టీకి అపూర్వ స్పందన లభించిందన్నారు.

మండల ఎన్నికల ఇన్‌చార్జి సునీతతో ఓటింగ్ సరళి గురించి చర్చిస్తున్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

ప్రజా క్షేత్రంలోకి విద్యుత్ శాఖ అధికారులు

శామీర్‌పేట, మే 15: విద్యుత్ సరఫరాలో సమస్యల పరిష్కారం కోసం ప్రజాభిప్రాయ సేకరణలో విద్యుత్ శాఖ అధికారులు ప్రజా క్షేత్రానికి వచ్చారు. ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని మజీద్‌పూర్ ఎస్సీ కాలనీ, నాగిశెట్టిపల్లిలోని తండ, దేవరయాంజాల్‌లోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో బుధవారం పర్యటించారు. విద్యుత్ సరఫరా, సమస్యల పరిష్కారంపై నేరుగా ప్రజలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ ఎస్ఈ డి.శ్రీరామ్ మోహ్మన్ మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ సరఫరా, సమస్యలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణలో ఉండాలని అధికారులను సూచించారు. గ్రామాల్లో పర్యటించి నేరుగా వేసవిలో విద్యుత్ సరఫరా, గృహజ్యోతి అమలు, ఈదురుగాలులు, వడగండ్ల వర్షాలతో సమస్యలు ఎదురైనప్పుడే ఫోన్ చూస్తే స్పందిస్తున్నారా లేదా సమస్య పరిష్కారం అవుతుందా అనే విషయాలను అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ శ్రీనాథ్‌రెడ్డి, ఏడీఈ ఎం వీ రమణారెడ్డి, ఏఈలు శ్రీనివాస్‌గౌడ్, రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుత్ సరఫరాపై మజీద్‌పూర్ ఎస్సీ కాలనీలో మహిళను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్ఈ డి.శ్రీరామ్ మోహన్

భక్తులకు మౌలిక వసతులు కల్పిస్తాం: ఎమ్మెల్యే

మల్కాజిగిరి, మే 15: భక్తులకు మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లోని శ్రీ గణపతి ఆలయ సప్తమి వార్షికోత్సవంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని ఆలయాల్లో భక్తుల కోసం మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్ కార్పొరేషన్ ఐదో వార్డు కార్పొరేటర్ మురుగేష్, మాజీ కార్పొరేటర్ జగదీశ్ గౌడ్. ఆలయ కమిటీ సభ్యులు రామచంద్రమూర్తి, భాస్కరరావు, వెంకటరమణ, రాధకృష్ణ, భీమశంకర్, శివరామ కృష్ణ, నాయకులు ఉపేందర్‌రెడ్డి, చిన్నయాదవ్, నవీన్‌యాదవ్, సూర్యప్రకాష్, అరుణ్, తేజరావు, శ్రీధర్, భరత్, వైశాలి, సూర్యకుమారి, రజిత, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఈస్ట్ ఆనంద్‌బాగ్ కల్యాణ్‌నగర్‌లోని శ్రీ గణపతి ఆలయంలో పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

19 నుంచి రంగనాయక స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

ఘట్‌కేసర్,మే15: పోచారం మున్సిపాలిటీ యంనంపేట్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 19 నుంచి 25 వరకు నిర్వహిస్తున్నట్లు ఈవో భాగ్యలక్ష్మి తెలిపారు.ఈనెల 21న రంగనాథ స్వామి,పద్మావతి,గోదాదేవి వేంకటేశ్వర స్వామిల కల్యాణం జరుగుతుందనారు. ఈ సందర్భంగా అన్నదానం ,ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణంలో పాల్గొనాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

అగ్నిమాపక సిబ్బంది సేవలు మరువలేనివి

చర్లపల్లి, మే 15: చర్లపల్లి పారిశ్రామికవాడలో అగ్నిమాపక సిబ్బంది సేవలు మరువలేనివని చర్లపల్లి పారిశ్రామికవాడ పారిశ్రామికవేత్తల సంఘం ఫేజ్ 3 అధ్యక్షుడు మియ్యాపురం రమేశ్ పేర్కొన్నారు. చర్లపల్లి పారిశ్రామికవాడలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సిబ్బంది సకాలంలో స్పందించి ప్రమాదాన్ని అరికట్టడంతో బుధవారం పారిశ్రామిక వేత్తలు అగ్నిమాపక సిబ్బంది, అధికారులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే సంబంధిత అధికారులు స్పందించి ప్రమాద తీవ్రతను తగ్గించడంలో సిబ్బంది పాత్ర మరువలేనిదన్నారు. అగ్నిమాపక కేంద్రం అధికారి శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే సకాలంలో సమాచారం అందించాలని, ప్రమాద తీవ్రతను అంచనా వేసి సకాలంలో ప్రమాదాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవాడ సీఐఏ ఉపాధ్యక్షుడు బాబర్ అలీ, కోశాధికారి సతీష్‌బాబు, ఐలా కోశాధికారి వెంకటరామిరెడ్డి, మన్నవ రాజు పాల్గొన్నారు.

చర్లపల్లి అగ్నిమాపక సిబ్బందిని సన్మానిస్తున్న చర్లపల్లి పారిశ్రామికవేత్తల సంఘం ఫేజ్ 3 అధ్యక్షుడు రమేశ్, పారిశ్రామికవేత్తలు

కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటాం..

శంకరమ్మను పరామర్శిస్తున్న కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి, ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

చర్లపల్లి, మే 15: కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ డివిజన్ పరిధిలోని ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాకారం లక్ష్మణ్ భార్య శంకరమ్మ అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న పరమేశ్వర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డితో కలిసి ఆమెను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యానికి గురైన శంకరమ్మకు మెరుగైన వైద్యం అందించాలని వారు వైద్యులను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలి

అల్వాల్ సర్కిల్ పాకాలకుంటలోని పల్లవి మోడల్ స్కూల్ విద్యార్థుల విజయోత్సవం

మల్కాజిగిరి, మే 15: పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలని పల్లవియ్య మోడల్ స్కూల్ చైర్మన్ కొమరయ్య సూచించారు. బుధవారం అల్వాల్ సర్కిల్ పాకాలకుంటలోని పల్లవి మోడల్ స్కూల్‌లోని 221విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబచర్చడంతో విజయోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీల్ నేగి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

మల్లికార్జున కుటుంబానికి ఆర్థిక సాయాన్ని అందిస్తున్న రమేశ్‌గుప్త

కీసర, మే 15:కీసరలోని స్నేహకాలనీలో నివాసం ఉంటున్న మల్లికార్జున ఇటీవల మృతి చెందాడు. ఆయన మృతికి బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్ ముదిరాజ్, రమేశ్‌గుప్త సంతాపం ప్రకటించి ఆయన కుటుంబాన్ని పరామర్శించి వెంకటేశ్ రూ.10వేలు, రమేశ్‌గుప్త రూ.5వేల ఆర్థిక సాయం చేశారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

చర్లపల్లి, మే 15: ప్లాస్టిక్ రంగంలోని శిక్షణ తరగతులను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని రామగుండం ఎన్టీపీసీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు పేర్కొన్నారు. చర్లపల్లి పారిశ్రామికవాడలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలాజీ(సీపెట్)లో ఎన్టీపీసీ సహకారంతో నిర్వహించిన ఆరు నెలల శిక్షణ తరగతులను ఆయన సీపెట్ హెడ్, చీఫ్ మేనేజర్ డాక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యుగంలో ప్లాస్టిక్ రంగం కోర్సులకు అధిక డిమాండ్ ఉందని, సీపెట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. గతంలో ఎన్టీపీసీ సహకారంతో శిక్షణ తీసుకున్న విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించామని ఆయన గుర్తు చేశారు. సీపెట్ చీఫ్ మేనేజర్ డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సీపెట్‌లో నిరుద్యోగ యువతీయువకులకు ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని ఆయన తెలిపారు.అనంతరం గతంలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఎన్టీపీసీ హెడ్, హెచ్ఆర్ విజయ్‌కుమార్ సిక్దార్, ఎన్టీపీసీ అధికారులు యోగేంధర్‌రావు, సుందర్, సీపెట్ అధికారులు అంజనేయశర్మ, శ్రీకార్, మణికందన్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

సీపెట్‌లో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులకు శిక్షణ సమాగ్రిని అందజేస్తున్న అధికారులు

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి

మల్లాపూర్, మే 15: నియోజకవర్గ పరిధిలోని పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మీర్‌పేట్ హెచ్‌బీకాలనీలోని బస్తీ దవాఖానలో ప్రతీ బుధవారం నిర్వహిస్తున్న 15 సంవత్సరాల వయసులోపు పిల్లలకు, గర్భిణులకు ఇమ్యూనైజేషన్ కోసం చేపట్టిన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ జె. ప్రభుదాస్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీర్‌పేట డివిజన్‌లోని బస్తీ దవాఖానలో సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఆరోగ్య సమస్యలు తలెత్తితే తన దృష్టికి తీసుకువస్తే నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పల్లవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇమ్యూనైజేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్ తదితరులు

ఆర్టీసీ కాలనీలో దొంగతనం

మేడ్చల్, మే 15 : పలు ఇండ్లలో దొంగతనం జరిగిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం...మంగళవారం రాత్రి మేడ్చల్ పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో దొంగతనాలకు పాల్పడ్డాడు. కాలనీలో నివాసం ఉండే పలువురు ఎన్నికల్లో ఓటు వేయడానికి తాళం వేసి, సొంతూళ్లకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దుండగులు వెంకన్న కిరాణం దుకాణంతో పాటు ఐదు ఇండ్లలో తాళం పగుల గొట్టి దొంగతనాలకు పాల్పడ్డారు. కిరాణ దుకాణంలో రూ.15వేలు ఎత్తుకెళ్లినట్టు బాధితులు తెలిపారు. మిగితా ఐదు ఇండ్లలో నుంచి కూడా నగదు, విలువైన వస్తువులను ఎత్తుకెళ్లినట్టు తెలుస్తోంది. అయితే ఊళ్లకు వెళ్లిన వారు తిరిగి వచ్చి, ఏమేమి పోయాయో వెల్లడించాల్సి ఉంది. బుధవారం ఉదయం తాళం పగులగొట్టిన విషయాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలికి వచ్చి, దొంగతనం జరిగిన ఇళ్లను పరిశీలించారు. దొంగల పట్టివేతకు దర్యాప్తు చేపట్టారు.

నర్సుల సేవలు వెలకట్టలేనివి..

● డాక్టర్ మధుసూదన్

శేరిలింగంపల్లి, మే 15 : సమాజంలో నర్సుల సేవలు ఎంతో కీలకమైనవని రంగారెడ్డి జిల్లా దవాఖాన డాక్టర్ మధుసూదన్ అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో శేరిలింగంపల్లిలో వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో సేవలందిస్తున్న ఉత్తమ నర్సులను ఘనంగా సన్మానించారు. డాక్టర్ మధుసూదన్ ముఖ్యఅతిథిగా హాజరై ఫ్లారెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అని, రోగులకు నర్సులు అందించే సేవలు వెలకట్టలేని వని అన్నారు. నైటింగేల్ సేవలను ఆదర్శంగా తీసుకొని నర్సులు మరిన్ని సేవలందించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామిమాధవ్, నర్సులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిలో ఉత్తమ సేవలందించిన నర్సులను సన్మానిస్తున్న డాక్టర్ మధుసూదన్, తదితరులు

అక్రమ నిర్మాణాల కూల్చివేత

గాగిల్లాపూర్‌లో అధికారులు పాక్షికంగా కూల్చివేసిన భవనం

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలపై బుధవా రం అధికారులు కొరడా ఝుళిపించారు. అనుమతులు తీసుకోకుండా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనాలు, సెల్లార్‌లను బ్రేకర్లు, జేసీబీలతో కూల్చివేస్తున్నారు. వరుసగా ఎన్నికలు రావడంతో ఇటీవల మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో కొందరు నిర్మాణదారులు ఇష్టారాజ్యంగా భవనాలను నిర్మిస్తున్నట్లు ఫిర్యాదులు స్వీ కరించిన అధికారులు బుధవారం చర్యలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం మున్సిపాలిటీ పరిధిలోని గాగిల్లాపూర్, డీ.పోచంపల్లి, మల్లంపేట్ తదితర వార్డుల్లో అక్రమ నిర్మాణాలను పాక్షికంగా కూల్చివేశారు. కూల్చివేతల్లో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మాదాపూర్, మే 15: మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం... మాదాపూర్‌లోని శిల్పారామం వద్ద ఫుట్‌పాత్‌పై ఓ వ్యక్తి పడి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వ్యక్తిని పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. కాగా మృతుడు 5.4 అడుగుల ఎత్తు, ఫెయిర్ కలర్, రింగుల జట్టు, చాక్లెట్ రంగు జాకెట్, బనియన్, నీలం రంగు జీన్స్ వేసుకున్నట్లు తెలిపారు. మృతుడు భిక్షాటన చేసే వ్యక్తిగా పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9890617182, 87112 56698 నంబర్లలో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 15 : కూకట్‌పల్లి(కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో బుధవారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 23, వంకాయ 23, బెండకాయ 35, పచ్చి మిర్చి 50, బజ్జి మిర్చి 35, కాకరకాయ 35, బీరకాయ 35, క్యాబేజీ 18, ఫ్రెంచ్ బీన్స్ 85, క్యారెట్ 35, కాలీఫ్లవర్ 18, దొండ 28, చిక్కుడు 65, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 23, క్యాప్సికం 45, ఆలుగడ్డ 28, కీర 18, దోసకాయ 15, సొరకాయ 11, పొట్లకాయ (1) 15, కందగడ్డ 70, ఉల్లిపొరక 65, ఉల్లిగడ్డ 22, చింతకాయ --, మామిడికాయ(1) 10 నుంచి 15, అరటికాయ(1) 7 నుంచి 8, చామగడ్డ 40, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 23, గుమ్మడికాయ 35, నిమ్మకాయలు(12) 65 నుంచి 75, మునగకాయ(1) 4 నుంచి 5, పచ్చి బఠాని-, బొప్పాయి 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 180, వెల్లుల్లి 240, చింతపండు 120, పండుమిర్చి 80 రూపాయలుగా ఉన్నాయి. ఈ ధరలు గురువారం ఉదయం 9.30 గంటల వరకు అమలులో ఉంటాయని రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

18 నుంచి ఆలయ వార్షికోత్సవాలు

కేపీహెచ్‌బీ కాలనీ: కేపీహెచ్‌బీ కాలనీ 6వ ఫేజ్‌లోని శ్రీ ఉమారామలింగేశ్వరస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ నిర్మాణ దాత, కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు తెలిపారు. ఈ నెల 18 నుంచి కాశీ పండితుల పర్యవేక్షణలో 3రోజుల పాటు వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం విజయ గణపతి స్వామి వారికి అభిషేకం, లక్ష గరిక పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశన, సాయంత్రం కాశీ పండితుల పర్యవేక్షణలో స్వామి వారికి సప్త ఋషి హారతి, నీరాజన మంత్ర పుష్పము పూజలు, ఆదివారం మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం,సోమవారం శ్రీ ఉమా దేవి అమ్మవారికి అభిషేకం. ఈ వేడుకల్లో కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత

● హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 15 : హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ.. అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు తెలిపారు. బుధవారం హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని రామ్‌నరేశ్‌నగర్ 2,3,4,5 రోడ్లలో యూజీడీ పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలు, బస్తీల్లో నెలకొన్న డ్రైనేజీ, రోడ్లు, తాగునీటి సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నామన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, వర్షాకాలం వరకల్లా పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నక్క శ్రీనివాస్, సత్యనారాయణ, రాజిరెడ్డి, రవి, చంద్రయ్య, రాఘవేందర్‌రెడ్డి, అంజిరెడ్డి, నరేందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, ఎల్లస్వామి, పీరయ్య, నాగార్జునరెడ్డి, బ్రహ్మయ్య, చంద్రారెడ్డి, నరసింహారెడ్డి, శ్రీశైలం, రాంచందర్, బాలాకృష్ణ, నరేశ్‌తో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

రాంనరేశ్‌నగర్‌లో యూజీడీ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు

ఎమ్మెల్యేను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

మాదాపూర్, మే 15: పార్లమెంట్ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ మాదాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కలిశారు. ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ గెలుపు కోసం కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. అనంతరం ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్న నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యేకుధన్యవాదాలు తెలిపారు.

'సద్గురు' విద్యార్థులకు ఉగాది పురస్కారాలు

పురస్కారాలు అందుకున్న సద్గురు ఆర్ట్స్‌స్కూల్ విద్యార్థులు

దుండిగల్, మే 15 : గత 56 ఏండ్లుగా ఎందరో కళాకారులను ప్రోత్సహిస్తున్న రసమయి సంస్థ త్యాగరాయ గాన సభలో మంగళవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో సద్గురు ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ విద్యార్థులకు చిత్రలేఖనంలో ఉగాది పురస్కారాలు అందజేసింది. 7వ తరగతి విద్యార్థి యలమర్తి పూజ్యంత్, 4వ తరగతి విద్యార్థి ప్రవ్యఆదిత్రి రెడ్డి కానాల, 8వ తరగతి విద్యార్థి సీహెచ్ ఇషిత్, 5వ తరగతి విద్యార్థి జి.కృతికాన్స్‌కు హైకోర్టు విశ్రాంత జడ్జి బి.చంద్రకుమార్, ప్రముఖ కూచిపూడి నాట్య గురువు ఎస్‌పీ భారతి,రసమయి సంస్థ అధ్యక్షుడు ఎంకే రాము పురస్కారాలను అందజేశారని స్కూల్ వ్యవస్థాపక డైరెక్టర్ సత్యవోలు రాంబాబు తెలిపారు. తమ పిల్లలు అవార్డ్స్ అందుకోవడం సంతోషంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులను సత్యవోలు రాంబాబు, సత్యవోలు పూజిత అభినందించారు.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తా..

శంశీగూడ వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్

కేపీహెచ్‌బీ కాలనీ, మే 15 : శంశీగూడలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ అన్నారు. బుధవారం శంశీగూడకు చెందిన ముఖ్య నాయకులు కార్పొరేటర్‌ను కలిసి సమస్యలను వివరించారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, శ్మశానవాటిక సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరయ్యాయని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. కాలనీలు, బస్తీల్లో ప్రజా సమస్యలను పరిష్కరించి ఆదర్శంగా తీర్చిదిద్దడమే ధ్యేయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రామకృష్ణగౌడ్, భాస్కర్‌రెడ్డి, వెంకట్‌నాయక్, గోపాల్, సురేందర్, లింగం, శ్రీనివాస్, సుధాకర్, నర్సింగరావు, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.